క్లుప్తంగా

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు



బోయినపల్లి: సద్దుల తుకమ్మ పండుగకు మండలకేంద్రంలో అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మలు నిమజ్జనం చేసే బోయినపల్లి చెరువు కట్ట వద్ద చదును చేసే పనులను ఆదివారం పంచాయతీ కార్యదర్శి అనిల్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట నాయకులు నల్ల మోహన్, మహిపాల్‌రెడ్డి, జలేందర్, పర్శరా ం, పొత్తూరి మహేందర్ తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

తంగళ్లపల్లి: వృత్తి విద్యా కోర్సులతో మెండుగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని మండెపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మామిళ్ల విఠల్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 32 మందికి ఇంటర్న్‌షిప్ ద్వారా జిమ్ సెంటర్, బ్యూటీషియన్ కోర్సులు పదిరోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయులు ఎండీ.హనీఫ్, వి.సాయినవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సెస్ విద్యుత్ బిల్లు

తంగళ్లపల్లి: సిరిసిల్ల విద్యుత్ సహకార సంఘం లిమిటెడ్ (సెస్) పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. సెస్ వెబ్‌సైట్ నుంచి ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, గూగుల్‌పే, అమేజాన్ పే, ఫోన్ పే, పేటీఎం ద్వారా ఇంటి నుంచి చెల్లించవచ్చని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన విజ్ఞాపనను ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా సెస్ ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారు. బిల్లు విషయంలో ఇబ్బందులు ఎదురైనా, సందేహాలు నివృత్తికోసం టోల్‌ఫ్రీ నంబర్ 18004250104 లో సంప్రదించవచ్చన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులే దోహదపడుతాయన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు బాబు, రవీందర్, బండారి బాల్‌రెడ్డి, గొల్లపల్లి మల్లేశం, రాములు, గోపాల్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వేములవాడరూరల్: వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హన్మాజిపేటలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యసిబ్బంది వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, మాజీ గవర్నర్ డాక్టర్ శివప్రసాద్, వైద్యులు చీకోటి సంతోష్ కుమార్, కోయినేని ప్రవీణ్, రాచర్ల ప్రవీణ్, అభినయ్, హారిక, ప్రదీప్ నామాల, వైద్య బృందం పాల్గొన్నారు.

వెంకటభారతికి అభినందన

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌కు చెందిన వెంకటభారతి ఉస్మానియాలో పీహెచ్‌డీ సాధించింది. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన వెంకటభారతి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మధుమేహం(డయాబెటిస్)పై పరిశోధనలు చేశారు. ఆమె చేసిన పరిశోధనలపై పీహెచ్‌డీ సాధించి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ మేరకు బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి గంగరాజు పీహెచ్‌డీ సాధించిన వెంకటభారతిని అభినందించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



ముస్తాబాద్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్న లింగారెడ్డిపల్లెకు చెందిన వల్లెపు శ్రీకాంత్ వాహనాన్ని పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా సిద్దిపేట నుంచి పోతుగల్‌కు టిప్పర్ ద్వారా ఇసుక రవాణా చేస్తున్నాడన్నారు. శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



బతుకమ్మ అంటేనే సంబురం



బతుకమ్మ పండుగ అంటేనే మహిళలకు సంబురం. ప్రపంచంలో ఎక్కడా జరుగని పూల పండుగ మన తెలంగాణలో జరుగుతుంది. పల్లెల్లో ఇంకా మహిళలు చాలా సంతోషంగా నిర్వహించుకుంటారు. రకరకాల పూలతో బతుకమ్మలు పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద పెట్టి ఆడుతాం. సంప్రదాయ రీతిలో ఆనందంగా ఆడిపాడుతాం.

– ముత్తయ్యగారి జ్యోతి, గంభీరావుపేట

ఏడాదిగా ఎదురుచూస్తాం



ఏడాదంతా బతుకమ్మ పండుగ ఎప్పుడు వస్తుందని ఆడపడుచులు ఎదురుచూస్తుంటారు. ఆడపడుచులకు బతుకమ్మ అతి పెద్ద పండుగ. పండుగ రోజు అందరు ఊరికి రావడం కుటుంబ సభ్యులంతా కలిసి వేడుక జరుపుకోవడం ఏడాది కాలం గుర్తుగా ఉంటుంది. బతుకమ్మ పండుగతో ఆటలు ఆడుకునేందుకు అవకాశం ఉంటుంది.

– తోట హైమావతి, ఎల్లారెడ్డిపేట

సంప్రదాయాలకు ప్రతీక



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుంది. ఎంగిలిపూలతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు ఈ పండుగ ఉంటుంది. సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. తొమ్మిది రోజులు బతుకమ్మ పేర్చి ఆడుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుంది. చివరి రోజు నిమజ్జనం చేసి ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చుకోవడం గొప్ప మధురానుభూతి కలుగుతుంది.

– బొమ్మకంటి జ్యోతి, ఎల్లారెడ్డిపేట

దుర్గామాతకు కుంకుమ పూజలు



సిరిసిల్ల టౌన్: మార్కండేయ యూత్ అసోసియేషన్ మండపంలో పూజలు చేస్తున్న విప్, నాయకులు



వేములవాడ అర్బన్ : తిప్పాపూర్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



తంగళ్లపల్లిలో దుర్గామాత వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు



ముస్తాబాద్ : పోతుగల్‌లో చండీహోమం



బోయినపల్లి: నర్సింగాపూర్‌లో..



ఎల్లారెడ్డిపేటలో..

వేములవాడఅర్బన్/సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపంలో ఆదివారం ఘనంగా కుంకుమపూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. మండల కేంద్రంలోని దుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ప్రముఖ వైద్యులు జి.సత్యనారాయణస్వామి, కాంగ్రెస్ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. సిరిసిల్లలో మార్కండేయ వీధిలోని దుర్గామాత మండపంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ ఏరియాలోని శ్రీ తుల్జాభవాని సేవాసమితి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా చండీ మాతాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కోనరావుపేట మండలం నాగారంలో దుర్గామాత వద్ద ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనగర్తి, నిమ్మపల్లిలో భక్తులకు అన్నదానం చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని డీఎక్స్ యూత్, గౌరీశ్వరి దేవి మండప్, పద్మనగర్‌లోని అంబాభవాని మండపంలో అన్నదానం నిర్వహించారు. బోయినపల్లిలో దేవీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. నర్సింగాపూర్‌లో దుర్గామాత వద్ద భక్తులు పూజలు నిర్వహించారు ముస్తాబాద్ మండలంలోని పోతుగల్‌లో చరణ్‌శర్మ ఆధ్వర్యంలో మహా చండీహోమం నిర్వహించారు.భక్తులు పూజలు చేశారు.

కార్మికులకు వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న కడారి రాములు

వేములవాడఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికులకు మూడునెలల వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ మండలం చీర్లవంచలో ఆయన మాట్లాడుతూ ముందుగా బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు ఉన్నందున కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, దేవయ్య, లక్ష్మణ్, గుండయ్య, వెంకటేశం తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారం



సిరిసిల్లటౌన్: పట్టణంలోని విద్యానగర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు ముఖ్య సలహాదారుల సమక్షంలో ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది.

‘కోస’ కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న అమర్, విమలక్క

సిరిసిల్ల: మావోయిస్టు అగ్రనేత కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస కుటుంబాన్ని ఆదివారం జనశక్తి నేత అమర్ అలియాస్ కూర దేవేందర్, అరుణోదయ విమలక్క పరామర్శించారు. తంగళ్లపల్లి గోపాల్‌రావుపల్లిలో సత్యనారాయణరెడ్డి సోదరుడు కరుణాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి కోసకు నివాళి అర్పించారు. వారి వెంట ప్రొఫెసర్ లక్ష్మీ, గాయని అనిత, వెంకటరెడ్డి, భూమిరెడ్డి తదితరులు ఉన్నారు. అంతకుముందు కోస కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ రామిరెడ్డి, మిరాల భాస్కర్ తదితరులున్నారు.

డీజీపీని కలిసిన చక్రధర్‌రెడ్డి

ముస్తాబాద్: రాష్ట్ర డీజీజీగా నియామకమైన శివధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి తెలిపారు. శివధర్‌రెడ్డి నివాసంలో డీజీపిని కలిసి అభినందించామన్నారు.

భీమన్న ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, తదితరులు

వేములవాడ: రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భీమేశ్వరాలయంలో అభివృద్ధి పనులను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. భీమేశ్వర ఆలయం, వీఐపీ రోడ్, పార్కింగ్ స్థలాలు, ఇతర ప్రాంతాలను సమీక్షించి, అధికారులకు తగు సూచనలిచ్చారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలు, షెడ్లు, శంకరమఠంలో నిర్మిస్తున్న అభిషేకం, కల్యాణ మండపాలు, క్యూలైన్లు, కౌంటర్లు, ఇతర సౌకర్యాల గురించి అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వేద పాఠశాల ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేస్తున్న వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేశ్, డీఈలు రఘునందన్, మహిపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రియాలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో మహిళలు

వేములవాడరూరల్: ఆస్ట్రియా దేశంలోని వియన్నాలో తెలుగు సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి రాయబార కార్యాలయం ఐఎఫ్ఎస్ అధికారి శ్రీమతి నిధి ధిమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



చందుర్తి: మండలంలోని మూడపల్లిలో తన తల్లి జోగినిపల్లి సుచితమ్మ జ్ఞాపకార్థం రూ.13లక్షలతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్, కూల్ వాటర్ ప్లాంట్‌ను విశాఖ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ జేపీరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేపీరావు మాట్లాడారు. గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలనే శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, బానాల రవీందర్‌రెడ్డి, చందుర్తి సింగిల్ విండో ఉపాధ్యక్షుడు పుల్కం, మోహన్, గ్రామైక్య సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబిడ్డ డిప్యూటీ కలెక్టర్



తల్లిదండ్రులతో రవితేజ

ఇల్లంతకుంట: మండలంలోని దాచారంకు చెందిన రాజు – దేవలక్ష్మి దంపతుల కుమారుడు మిందె రవితేజ గ్రూప్ 1లో ఉద్యోగం సాధించాడు. సిద్దిపేటలో పదో తరగతి వరకు, ఇంటర్మీడియట్ కరీంనగర్, జేఎన్టీయూ కొండగట్టులో బీటెక్ పూర్తిచేశాడు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలో విజయం సాధించి హుస్నాబాద్ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించాడు. గ్రూప్ 1లో 62వ ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రైతుల సంక్షేమమే సహకార లక్ష్యం



మాట్లాడుతున్న చైర్మన్ సుధీర్‌రావు

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘం పని చేస్తోందని, సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలని సింగిల్‌విండో చైర్మన్ రామగిరి సుధీర్‌రావు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ సింగిల్‌విండో మహాజన సభ ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ. 87లక్షల దీర్ఘకాలిక రుణాలను అందించామన్నారు. 2024–25లో సంఘం ఏ గ్రేడ్‌లో ఉండి లాభాల బాటలో పయనిస్తుందన్నారు. రానున్న రోజుల్లో రైతులకు పెద్దఎత్తున రుణాలు అందిస్తామన్నారు. వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, డైరెక్టర్లు, సీఈవో శశివర్ధన్, రైతులు పాల్గొన్నారు.

గుంతలరోడ్లతో అవస్థలు

- మండలంలో గుంతలు, బురదమయంగా రోడ్లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా తెర్లుమద్ది-సేవాలాల్ తండా రోడ్డు

ముస్తాబాద్: మండలంలో మట్టిరోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్లు బీటీరోడ్లుగా మారుతాయని భావిస్తున్నా ప్రజలకు నిరాశే ఎదురవుతుంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్నా రహదారుల విస్తరణ పనులకు మోక్షం కలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో గుంతలమయంగా, బురదగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

మండలంలో మట్టి రోడ్ల పరిస్థితి..

➡ తెర్లుమద్ది విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పీడబ్ల్యూడీ రహదారి నుంచి రాగంపల్లెకు వెళ్లే రెండుకిలోమీటర్ల రహదారి మట్టిరోడ్డుగా ఉంది. పదేళ్లుగా దీనిని అభివృద్ధి చేయాలని రాగంపల్లె వాసులతోపాటు అటుగా ఉన్న తండావాసులు కోరుతున్నారు. పైగా మూడు కిలోమీటర్ల రహదారిలో రెండు కిలోమీటర్లు బీటీవేసి మరో కిలోమీటర్ మట్టి రోడ్డును వదిలేశారు.

➡ రాగంపల్లె రోడ్డు మిగులు పనులను చేపట్టేందుకు ఏడాదిక్రితం పనులు మొదలుపెట్టారు. కల్వర్టులు నిర్మించి బీటీరోడ్డు వేయడం లేదు. ఇప్పుడు అదే రహదారిని సీసీ వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

➡ తెర్లుమద్ది–సేవాలాల్‌తండా రహదారిలో కిలోమీటర్ రోడ్డు మట్టిరోడ్డు ఉంది. ఏడేళ్ల క్రితం ఈ రెండు గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డులో కిలోమీటర్ పనులు వదిలేశారు. పంచాయతీ అధికారులు మట్టిని పోయాలని తండావాసులు కోరుతున్నారు.

➡ పోతుగల్, గూడెం మధ్య కొండ చెరువుపై రహదారి గుంతలమయంగా మారింది. చెట్లు పెరిగి దారికి అడ్డంగా ఉన్నాయి.

➡ ఆవునూర్, రామలక్ష్మణపల్లె రహదారిలో సీసీ ధ్వంసమైంది. కల్వర్టులు దెబ్బతిని రహదారి గతుకులమయంగా మారింది.

➡ చిప్పలపల్లి, గోపాల్‌పల్లె గ్రామాల మధ్య కిలోమీటరున్నర రహదారి విస్తరణ పనులకు నోచుకోవడం లేదు. విస్తరణ పనుల్లో నిధులు సరిపోలేదని కొంతభాగాన్ని వదిలేశారు.

ఇబ్బంది పడుతున్నాం



మెయిన్‌రోడ్డు నుంచి రాగంపల్లె రోడ్డును పూర్తిచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశాం. తెర్లుమద్ది రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారుల్లో వాహనాలు నడిపేందుకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేపట్టాలి.

– కట్ట బాపురావు, బట్టోనితాళ్లు

నిధులు మంజూరు చేయాలి



తెర్లుమద్ది నుంచి తండాకు వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. వానాకాలంలో దారిపై నడిచే పరిస్థితి లేదు. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం గుంతలనైన పూడ్చాలి. కనెక్టివిటీ దారులను మరమ్మతు చేయాలి. విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలి.

– ఈసరి కృష్ణ, తెర్లుమద్ది

ప్రతిపాదనలు సిద్ధం చేశాం



గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. పండుగలకు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. డిపార్ట్‌మెంట్ల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసేలా చూస్తాం. నిధులు రాగానే పనులు మొదలుపెడుతాం.

– లచ్చాలు, ఎంపీడీవో

సంక్షిప్త వార్తలు

• **క్రీడలతో మానసికోల్లాసం**



కోనరావుపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. సుద్దాలలో దొబ్బల స్వామి స్మారక మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. మండలవ్యాప్తంగా 20 టీములు పాల్గొనగా మొదటి విజేతగా సుద్దాల జట్టు, రెండవ విజేత మామిడిపల్లి జట్టు నిలిచింది. వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహకులు దొబ్బల ప్రవీణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రోళ్ల భాస్కర్, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, నాయకులు కచ్చకాయల మహేశ్, పర్శురాం, రాకేష్, అన్వేష్, అంజయ్య, అవురం సురేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

• **మహ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయం**

వేములవాడ: మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయమని హైదరాబాద్ మజ్లిస్ తహఫుజ్ ఖత్మే నబువత్ ధార్మిక పండితుడు మౌలానా అబ్దుల్ ఖవీ ఉమ్రీ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆయన జీవిత చరిత్రపై ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. ఆయన జీవిత చరిత్ర అన్ని కులాలు, వర్గాల వారికి తెలియపర్చాలనే ఉద్దేశంతో ఆధ్యాత్మిక సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మజ్లిస్ తహఫుజ్ ఖత్ నబువ్వత్మే రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి మహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్, మదర్సా తాలిముల్ ఖురాన్ ప్రిన్సిపాల్ మౌలాన ఆసిం హుస్సామి, వేములవాడ ముస్లిం ఇంతేజామియా కమిటీ అధ్యక్షు డు అక్రమ్, సభ్యులు ముషాహిద్, ఫహద్, సంధాని, షకీల్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

• **పారదర్శకంగా సహకార సేవలు**

బోయినపల్లి: మండలంలోని కోరెం సింగిల్‌విండో పరిధిలోని గ్రామాల రైతులకు పారదర్శకంగా సహకార సేవలు అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్యాలయంలో సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.57 లక్షల దీర్ఘకాలిక, రూ.7లక్షలు స్వల్పకాలిక, రూ.18 లక్షల మేర పంట రుణాలు అందించినట్లు తెలిపారు. అక్టోబర్ 1నుంచి బంగారు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

• **దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం పరిశీలించారు. రథం, జమ్మిగద్దెలను పరిశీలించి అలంకరణలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్, సభ్యులు బందారపు బాల్‌రెడ్డి, చెన్ని బాబు, బాద రమేశ్, బాల్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

• **భూమిపూజ**

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ నిధులతో బోరుబావికి ఆదివారం భూమిపూజ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేశ్, రేగుల సంతోష్, మెర్గు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

• **రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు**

వేములవాడఅర్బన్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వేములవాడ మండలం మారుపాక రహదారిలో కారు, బైక్ ఢీకొనడంతో సంకెపల్లికి చెందిన మచ్చ చిరు, పండగ సుశాంత్ ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇద్దరిని వేములవాడ ఏరియాఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో..

సంకెపల్లి శివారు కరీంనగర్ – సిరిసిల్ల ప్రధాన రహదారిలో లారీ, బొలెరో వాహనం ఢీకొని బొలెరో డ్రైవర్ రాకేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.